క్లుప్తంగా

హాల్‌టికెట్లు ఇవ్వాలి

నెల్లూరు (టౌన్‌): డిగ్రీ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని ప్రైవేట్‌ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో చాలా మందికి హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

డ్రోన్‌ నిఘా నీడన



నెల్లూరు(క్రైమ్‌): నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా నగరాన్ని డ్రోన్‌ కెమెరా నీడలోకి పోలీస్‌ అధికారులు తీసుకొచ్చారు. స్టేషన్ల వారీగా నిఘా పెట్టారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని నవాబుపేట సెంటర్‌, కుసుమ దళితవాడ, ఎఫ్‌సీఐ కాలనీ, శెట్టిగుంటరోడ్డు, యనమలపాళెం, మైపాడు రోడ్డు, సత్యనారాయణపురం ప్రాంతాల్లో డ్రోన్‌తో మంగళవారం పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్‌ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

వేడుకగా పోలేరమ్మ జాతర



విడవలూరు: మండలంలోని ముదివర్తిలో పోలేరమ్మ జాతరను గ్రామస్తులు మంగళవారం నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు భారీగా తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. పార్టీ నేత కొండూరు వెంకటసుబ్బారెడ్డి, పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్‌ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీపీ సౌందర్య, కాయల రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



సత్కారం అందుకున్న మహిళా ఉపాధ్యాయులు

విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్‌ – వీఎస్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రిన్సిపల్‌ సుజాత మాట్లాడారు. ఆదర్శ మహిళలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. అనంతరం మహిళా అధ్యాపకులను సత్కరించారు. వైస్‌ ప్రిన్సిపల్‌ మధు, ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ కన్వీనర్‌ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

కొడవలూరు: ప్రీ స్కూల్‌ స్థాయి నుంచే యోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ నిర్మల పేర్కొన్నారు. కొడవలూరులోని మెయిన్‌ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, ప్రీ స్కూల్‌ పిల్లలతో యోగాను మంగళవారం సాధన చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రీ స్కూల్‌ దశ నుంచే యోగా ఆవశ్యకతను తెలియజేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త రమీజా పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

ఇందుకూరుపేట: స్థల వివాదమై మండలంలోని చట్టివారికండ్రిగలో ఇరువర్గాల మధ్య వివాదం మంగళవారం జరిగింది. దీంతో తల్లీకొడుకు కలిసి మరోవర్గానికి చెందిన ముగ్గురిపై కత్తితో దాడిచేసి గాయపర్చారు. పోలీసుల వివరాల మేరకు.. చట్టివారి కండ్రిగకు చెందిన శ్రీనివాసులు.. వెంకటేశ్వర్లు వరుసకు సోదరులు. వీరి మధ్య భూ వివాదం నెలకొంది. ఈ క్రమంలో భూమికి కొలతసేందుకు గానూ సర్వేయర్‌ మంగళవారం రాగా, వెంకటేశ్వర్లు అడ్డుకున్నారు. దీంతో సర్వేయర్‌ వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాసులు తన తల్లి కోటేశ్వరమ్మతో కలిసి వెంకటేశ్వర్లును కత్తితో పొడిచారు. ఆయన తీవ్రంగా, తల్లి శేషమ్మ, సోదరి మాధవి స్వల్పంగా గాయపడ్డారు. హత్యాయత్నం కేసును ఎస్సై నాగార్జునరెడ్డి నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

మొత్తుకుంటున్నా.. చెవికెక్కించుకోరా..?



మితిమీరిన వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో పలువురు ప్రాణాలు కోల్పోతుండగా, అధిక శాతం మంది క్షతగాత్రులవుతున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇలా ప్రమాదాల బారిన పడుతున్నారు. నిబంధనలు పాటించాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు నూతన మోటార్‌ వాహన చట్టాన్ని జిల్లాలో ఈ నెల ఒకటిన అమల్లోకి తెచ్చి.. ఉల్లంఘనలపై భారీగా జరిమానాలను విధిస్తున్నారు. అయినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒంటి చేత్తో బైక్‌లు నడపడం.. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ.. ట్రిబుల్‌ రైడింగ్‌.. హెల్మెట్‌ లేకుండా వాహనాలను నడిపేస్తున్నారు. వాహనచోదకులు నిర్లక్ష్యాన్ని వీడి ట్రాఫిక్‌ నిబంధనలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నెల్లూరు(క్రైమ్‌)





నాటుసారా రహిత జిల్లానే లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్‌): జిల్లాను నాటుసారా రహితంగా తీర్చిదిద్దడమే నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశమని ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని సర్వోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నవోదయం 2.0పై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాటుసారాను పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని వెల్లడించారు. నాటుసారా తాగడంతో సంభవించే దుష్పరిణామాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడంలో అధ్యాపకులు, విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరా జరుగుతున్నాయని గుర్తిస్తే స్థానిక ఎక్సైజ్‌ అధికారులు, టోల్‌ఫ్రీ నంబర్‌ 14405కు సమాచారం అందించాలని కోరారు. ఏఈఎస్‌ జగదీశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్‌ నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌బాబు, ఎస్సైలు ప్రభాకర్‌, కాలేషావలీ, మురళీకృష్ణ, కరస్పాండెంట్‌ హేమచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్‌): ఇంటి నుంచి బయటకెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటనపై కేసును నవాబుపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తడికలబజార్‌ సెంటర్‌కు చెందిన సుమన్‌కుమార్‌ స్థానికంగా మొబైల్‌ షాపును నిర్వహిస్తున్నారు.
పనినిమిత్తం గతేడాది డిసెంబర్‌ 17న ఇంటి నుంచి బయట కొచ్చిన ఆయన అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్‌ అన్వర్‌బాషా తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



నెల్లూరు(క్రైమ్‌): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌ హాల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సోషల్‌ మీడియాలో గోప్యతకు డిజిటల్‌ భద్రత అవసరం.. ఆత్మరక్షణ అనేది ఒక ఎంపిక కాదు అవసరం.. మహిళలు సురక్షితంగా పని చేసే ప్రదేశం – వేధింపులపై మౌనాన్ని వీడండి.. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు సురక్షితం – సవాళ్లు.. మహిళల భద్రతకు భరోసా ఇవ్వడంలో పురుషుల పాత్ర అనే అంశాలపై వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపర్చారు. విజేతలకు బహుమతులను అంతర్జాతీయ మహిళా దినోత్సవాన అందజేయనున్నామని ఏఎస్పీ సౌజన్య పేర్కొన్నారు. నగర డీఎస్పీ సింధుప్రియ, డీటీసీ, మహిళా పోలీస్‌స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్లు మిద్దె నాగేశ్వరమ్మ, సుబ్బారావు, వెల్ఫేర్‌ ఆర్‌ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

భార్య, అత్తమామలపై దాడి

నెల్లూరు(క్రైమ్‌): భార్య, అత్తమామలు, వదినపై దాడి చేసిన ఘటనలో నిందితుడిపై కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటకు చెందిన గాయత్రి, బాలరాజు ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ పాప ఉంది. భర్త ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో గాయత్రి తన కుమార్తెతో కలిసి అదే ప్రాంతంలోని తన తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. బాలరాజు వేరే మహిళతో సన్నిహితంగా ఉండటంతో ఇటీవల భార్య నిలదీశారు. దీంతో ఆగ్రహానికి గురై తన భార్య వద్దకు సోమవారం రాత్రి వెళ్లి దాడి చేశారు. అడ్డుకోబోయిన అత్తమామలు, వదినపై సైతం దాడికి పాల్పడ్డారు. స్థానికులు మందలించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ మేరకు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీలను బ్లాక్‌ చేయడం తగదు

నెల్లూరు (టౌన్‌): ఉపాధ్యాయ బదిలీల డ్రాఫ్ట్‌లో ఖాళీలను బ్లాక్‌ చేయడాన్ని మానుకోవాలని ఏపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్సీని నిర్వహించి రిక్రూట్‌మెంట్‌ జరపాల్సింది పోయి ఉన్న ఖాళీలను బ్లాక్‌ చేయడం తగదన్నారు. దీంతో సుదూర ప్రాంతాల్లో ఎంతో కాలంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని చెప్పారు.

పన్నుల చెల్లింపుపై ప్రచారం చేయండి



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న అదనపు కమిషనర్‌

నెల్లూరు(బారకాసు): ఆస్తి, కుళాయి పన్ను బకాయిలను ఈ నెలాఖరు నాటికి చెల్లించేలా విస్తృతంగా ప్రచారం చేయాలని అదనపు కమిషనర్‌ నందన్‌ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్‌ సెంటర్‌లో రెవెన్యూ విభాగాధికారులు, సచివాలయ అడ్మిన్‌ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసార మాధ్యమాలు, ఆటోల ద్వారా అన్ని డివిజన్లలో ప్రచారాన్ని నిరంతరం నిర్వహించి, పన్నులను నూరు శాతం వసూలు చేయాలని సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక పన్ను వసూళ్ల కౌంటర్లను ఏర్పాటు చేసి సంబంధిత రెవెన్యూ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానికంగా అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్‌ ద్వారా సంప్రదించి ఆన్‌లైన్లో చెల్లించేలా చూడాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్‌ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణలో ఎల్టీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్‌): రోగ నిర్ధారణలో ల్యాబ్‌ టెక్నీషియన్ల పాత్ర కీలకమని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్‌ టెక్నీషియన్లతో నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులకు సరైన వైద్యం అందాలంటే కచ్చితమైన రక్త పరీక్షలతో పాటు ఇతర పరీక్షలను నాణ్యవంతంగా చేపట్టాలని సూచించారు. సమయపాలన పాటించాలని, విధులకు ఆలస్యంగా హాజరైతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పరీక్షలకు సంబంధించిన వివరాలను నిశ్చయ్‌ పోర్టల్లో పొందుపర్చాలని సూచించారు. అనంతరం జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ మాట్లాడారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తుల కోసం ఎమ్మెమ్డీపీ కిట్లను పంపిణీ చేయనున్నామని చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చికున్‌ గున్యా అనుమానిత లక్షణాలు ప్రబలుతున్న తరుణంలో లార్వా సర్వేను జరపాలని ఏఎన్‌ఎంలకు సూచించారు. గణాంకాధికారి సహన తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌ సంస్థల భాగస్వామ్యంతో పార్కుల నిర్వహణ



మాట్లాడుతున్న నందన్‌

నెల్లూరు(బారకాసు): నగరంలోని పార్కుల నిర్వహణలో ప్రముఖ వ్యాపార సంస్థలను ప్రైవేట్‌ ఏజెన్సీలుగా భాగస్వాములను చేయనున్నామని అదనపు కమిషనర్‌ నందన్‌ పేర్కొన్నారు. నగరంలోని ప్రముఖ వ్యాపార సంస్థల ప్రతినిధులు, ఇంజినీరింగ్‌ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్‌ కంట్రోల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాచ్‌మెన్‌, గార్డెనర్లను నియమించి పార్కులను మరింత ప్రణాళికబద్ధంగా నిర్వహించనున్నామని చెప్పారు. 64కు గానూ 36 పార్కుల నిర్వహణలో ప్రైవేట్‌ ఏజెన్సీల భాగస్వామ్యానికి సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. నగరపాలక సంస్థ ఉద్యానశాఖ ఏడీ ప్రదీప్‌కుమార్‌, ఇంజినీరింగ్‌ విభాగ ఈఈలు శ్రీనివాసరావు, శేషగిరిరావు, డీఈ సుదేష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని నీరుగార్చేలా బడ్జెట్‌



సమావేశంలో నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): ప్రజా సంక్షేమాన్ని నీరుగార్చేలా కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లున్నాయని, వీటిని ఎండగడుతూ ప్రచారోద్యమాన్ని చేపట్టాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వూరి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సండే మార్కెట్లోని ఓపీడీఆర్‌ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఇవి ఉన్నాయని ఆరోపించారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఓపీడీఆర్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌, రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌రావు, సభ్యులు వెంకటరమణయ్య, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లైన్‌మెన్ల దినోత్సవం



సేవా పురస్కారాల ప్రదానం

నెకల్లూరు(వీఆర్సీసెంటర్‌): విద్యుత్‌ సంస్థకు లైన్‌మెన్లు పునాదుల్లాంటివారని ఎస్పీడీసీఎల్‌ జిల్లా సర్కిల్‌ ఎస్‌ఈ విజయన్‌ పేర్కొన్నారు. లైన్‌మెన్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యుత్‌ భవన్‌లోని స్కాడా భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కేక్‌ను కట్‌ చేశారు. అనంతరం నెల్లూరు టౌన్‌ పరిధిలోని 12 సెక్షన్లలో ఉత్తమ ప్రతిభ కనపబర్చిన 12 మందికి ఉత్తమ సేవా పురస్కారాలను అందజేసి సత్కరించారు. నెల్లూరు టౌన్‌ ఈఈ శ్రీధర్‌, డీఈఈలు అశోక్‌, సునీల్‌, కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయులకు సత్కారం



నెల్లూరు (టౌన్‌): నగరంలోని రావూస్‌ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో బెస్ట్‌ ఇంగ్లిష్‌ టీచర్‌ అవార్డు కార్యక్రమాన్ని ఇంగ్లిష్‌ టీచర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అంకితభావంతో పనిచేసిన 24 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఈఓ అబ్దుల్‌ హమీద్‌, డీసీఈబీ సెక్రటరీ రామ్‌కుమార్‌, అసోసియేషన్‌ వ్యవస్థాపకుడు చంద్రకుమార్‌, స్టాన్లీ ప్రకాష్‌, ప్రెసిడెంట్‌ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దవనోత్సవం



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో దవనోత్సవాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. స్వామివారు విశేష పుష్పాలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పులిమి మల్లికార్జునరెడ్డి, శిల్పారెడ్డి దంపతులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

వేడుకగా గరుడ పంచమి

నెల్లూరు(బృందావనం): గరుడ పంచమిని పురస్కరించుకొని నగరంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గరుడసేవను వేడుకగా మంగళవారం నిర్వహించారు. తాయార్లకు పూలంగిసేవను జరిపారు. మూలవర్లు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

